22112024-MAI-04_Layout 1 11/22/2024 3:36 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# లగచర్ల ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

**వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఇటీవల ప్రభుత్వాధికారులకు, గిరిజన రైతులకు మధ్య జరిగిన అవాంఛనీయ ఘటనపై పౌర సమాజం పక్షాన కొన్ని విషయాలను ప్రభుత్వం ముందు పెట్టదలుచుకున్నాం. లగచర్లలో ఫార్మా విలేజ్ నిమిత్తం భూసేకరణ కోసం తలపెట్టిన గ్రామసభలో చెలరేగిన ఘర్షణ ఆందోళన కలిగిస్తున్నది. ఇలాంటి ఘటనలు సమస్యను మరింత జటిలం చేస్తాయని, పరిష్కారానికి దోహదపడవని భావిస్తున్నాం. అయితే, చట్టపరిధిలో సజావుగా జరగాల్సిన ప్రక్రియ, అలా జరగకుండా ఎందుకు ప్రజలు తిరగబడే పరిస్థితి వచ్చిందో నిష్పాక్షికంగా పరిశీలించాలి.**



సంఘటన వెనుక ఉన్న నేపథ్యాన్ని, గిరిజన రైతుల ఆవేదననూ సమగ్రంగా పరిశీలించాలి. గ్రామస్థులు ఎందుకంత తీవ్రంగా ప్రతిస్పందించవలసి వచ్చిందో కారణాలు తెలుసుకోవాలి. పూర్వాపరాలను పరిశీలించకుండా, సంఘటనను మాత్రమే చూసినప్పుడు సరైన నిర్ణయానికి రాలేం, సమస్యను పరిష్కరించలేం. ఈ సంఘటనకు గత ఆరు నెలల నేపథ్యం ఉన్నది. ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం చేస్తున్న భూ సేకరణ ప్రయత్నాలను లగచర్ల వాసులు మొదటినుంచీ వ్యతిరేకిస్తున్నారు. వాళ్లు ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వలేమని, బలవంతపు భూ సేకరణ జరగకుండా నిరోధించి తమ భూముల ను పరిరక్షించాలని ప్రభుత్వానికి, వివిధ రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తులు చేశారు. వారికి ప్రభుత్వం వైపు నుంచి న్యాయమైన స్పందన కరువైంది. కొంతమంది నాయకులు, అధికారులు, వ్యక్తులు అదేపనిగా రైతులను వేధించడం వల్ల వారిపట్ల గ్రామస్థుల్లో తీవ్ర ఆగ్రహం చోటుచేసుకున్నది. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా అధికారులు అంతకంతకూ ఒత్తిడి పెంచుతూపోయిన నేపథ్యంలో ఏర్పడిన నిస్సహాయ స్థితిలోంచి ప్రజాగ్రహం పెల్లుబుకింది. ఆగ్రహ ప్రకటన అదుపు తప్పి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ప్రజాస్వామ్యంలో ఈ రకమైన దాడులు సమస్యలకు పరిష్కారం చూపవు. అంతేకాకుండా సమస్యను పక్కదారి పట్టించడానికి కారణమవుతాయి. గ్రామంలోని 80 శాతం జనాభా ఆమోదించకుండా భూ సేకరణ చేయకూడదని 2013 భూ సేకరణ చట్టం నిర్దేశిస్తున్నది. రైతులను, గ్రామస్థులను విశ్వాసంలోకి తీసుకొని భూ సేకరణకు పూనుకొని ఉంటే ఇలాంటి అవాంఛనీయ ఘటన తలెత్తేది కాదని మేం భావిస్తున్నాం.

> **నవంబర్ 11వ తేదీన జరిగిన అవాంఛనీయ ఘటనపై విచారణ జరిపించాలి. అయితే అది కూడా చట్టసమ్మతంగానే జరగాలి తప్ప, ప్రతీకార దృష్టితో కాదని తెలియజేస్తున్నాం. అర్ధ రాత్రి వందల మంది పోలీసులు లగచర్ల గ్రామాన్ని చుట్టుముట్టి 66 మందిని అరెస్టు చేశారు. 37 మందిని జైలుకు పంపించారు.**

అరెస్టు చేసినవారిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితులు ఆరోపిస్తున్నారు. వారు సరిగా నడవలేకపోతున్న వీడియోలు చూస్తే, ఆ ఆరోపణలకు బలం చేకూరుతున్నది. లగచర్ల ఘటనపై, గ్రామస్థుల ఆందోళన, ఆరోపణలపై వెంటనే జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ముఖ్యంగా భయకంపితులైన రైతులకు, గ్రామస్థులకు సాంత్వన చేకూర్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. ఇరుపక్షాలకూ ఆమోదయోగ్యమైన వ్యక్తులతో కమిటీ వేసి గ్రామస్థులతో సంప్రదింపులు జరపాలని, శాంతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాం. అందుకు భిన్నంగా సంఘటనను అడ్డం పెట్టుకొని గిరిజన రైతుల మీద, ఉద్యమ నాయకుల మీద అణచివేతకు పూనుకుంటే సమస్య మరింత జటిలంగా మారుతుంది తప్ప పరిష్కారం కాదని తెలియజేస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ప్రజాస్వామిక వైఖరితో వ్యవహరించాలని కోరుతున్నాం.

ఇట్లు..

కె.శ్రీనివాస్
సంగిశెట్టి శ్రీనివాస్
టంకశాల అశోక్
కట్టా శేఖర్‌రెడ్డి
డి.పాపారావు
దంటు కనకదుర్గ
కె.సీతారామారావు
గోరటి వెంకన్న
శ్రీధర్‌రావు దేశ్‌పాండే
హమీద్ మహ్మద్ ఖాన్
శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
బద్రి నర్సన్
కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి
వర్ధుల శివకుమార్
ఎర్రోజు శ్రీనివాస్
అజయ్‌కుమార్ వారాల
సజయ కాకర్ల
సంధ్య పీవోడబ్ల్యూ
పాశం రఘునందన్ రెడ్డి
వి.ప్రకాశ్
దేవీప్రసాద్‌రావు
జూలూరు గౌరీశంకర్
కాంచనపల్లి
గోవర్ధన రాజు
మంగళ ఒపల్లి విశ్వేశ్వర్
పిట్టల రవీందర్
అస్కాని మారుతీసాగర్
పెద్దింటి అశోక్ కుమార్
మల్లావఝుల
విజయానంద్
స్వర్ణ కిలారి
సుబ్బయ్య వనపట్ల
తైదల అంజయ్య
కె.రంగాచారి
దీప్తి సరళ
డాక్టర్ ఎ.రఘుకుమార్
బి.భుజంగరావు
ఎం.ఎ.హమీద్
ఎల్.శ్రీనివాస్ రెడ్డి

నమస్తే తెలంగాణ

## గురుకులాల గోస

*బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కళకళలాడిన గురుకులాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. సౌకర్యాల లేమి, విద్యార్థుల చావులతో తరచుగా వార్తలకెక్కుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికాకముందే గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ వల్ల వందల మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. యాదాద్రి జిల్లా భువనగిరి గురుకుల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఆహారం వికటించి మృతిచెందడం బాధాకరం. ఇటీవల వాంకిడిలో అస్వస్థతకు గురైన ఒక బాలిక 20 రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నది. అంతకుముందు పాము కాటుతో ఓ విద్యార్థి మరణించాడు. అటు విద్యార్థుల ఆత్మహత్యలూ పెరిగాయి. కాంగ్రెస్ పాలనా పగ్గాలు చేపట్టిన ఏడాదిలోపే 42 మంది విద్యార్థులు మరణించారు. ఇంత జరుగుతున్నా సర్కారులో స్పందన లేదు. బీఆర్‌ఎస్ నేతలు ఈ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తే మంత్రులు తూతూమంత్రంగా ప్రకటనలు చేసి చేతులు దులుపుకొంటున్నారు.*

*గత పదేండ్ల కాలంలో అద్వితీయమైన అభివృద్ధిని చూసిన గురుకులాలు ప్రస్తుతం సమస్యలకు నెలవుగా మారాయి. ప్రభుత్వం మారిన తర్వాత వాటిని పట్టించుకునే నాథుడే లేడు. గురుకులాల్లో చదవడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటాయని ఒక అధ్యయనంలో తేలినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గురుకులాల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. గురుకులాల విషయంలో రేవంత్ ప్రతికూల అభిప్రాయాలు వ్యక్తం చేయడం అదే మొదటిసారి కాదు, చివరిసారీ కాదు. ఇదంతా గమనిస్తుంటే నిర్లక్ష్యంతో నిరాదరణకు గురిచేసి మెల్లమెల్లగా గురుకులాల ఉసురు తీయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదా? విలీనం పేరిట మొత్తంగా వాటి అస్తిత్వాన్ని దెబ్బతీసి దళిత బహుజన వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర పన్నుతున్నదా? లేక కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ బహుజన బిడ్డల బడులను బలి చేస్తున్నదా? అనే అనుమానాలు రాక మానవు. గురుకుల విద్యా జేఏసీ ఆందోళన బాట పట్టినా సర్కారుకు చీమ కుట్టినట్టయినా లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?*

*గత కేసీఆర్ ప్రభుత్వం వివిధ రంగాల్లో సాధించిన ఘన విజయాల్లో గురుకులాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. అన్నివర్గాల పిల్లలకు మెరుగైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో కృషిచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల కోసం ప్రత్యేక గురుకులాలను ఏర్పాటుచేశారు. సకల వసతులు సమకూర్చి గ్రామీణ పేద విద్యార్థులకు చక్కని విద్యనందించారు. బీఆర్‌ఎస్ హయాంలో గురుకులాల సంఖ్య గణనీయంగా పెరిగి 1100కు చేరింది. గురుకులాల్లో చదివిన పిల్లలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పోటీ పరీక్షల్లో సత్తా చాటే స్థాయికి ఎదగడం గమనార్హం. బడుగుల విద్యా ప్రదాతగా బీఆర్‌ఎస్ మన్ననలు పొందింది. కానీ, కాంగ్రెస్ సర్కారు అందుకు భిన్నంగా గురుకులాలను అతలాకుతలం చేస్తున్నది. ఇది 'ఆనవాళ్ల చెరిపివేత రాజకీయం' అనుకోవాలా? లేక బహుజనుల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ అనాదిగా అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలకు కొనసాగింపుగా భావించాలా? అయితే, చదువులను సకలజనులకు అందుబాటులోకి తెచ్చే గురుకుల విద్యావ్యవస్థను నాశనం చేస్తే మాత్రం చరిత్ర క్షమించదని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.*

## కక్ష సాధింపే కాంగ్రెస్ ఎజెండానా?



నర్సన్ బద్రి
94401 28169

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు, చేష్టలు ఏ మాత్రం ప్రజలు హర్షించేలా లేవు. ఆయన నోరు పెద్దగా చేసుకొని పబ్బం గడుపుకోవాలనుకుంటున్నారు. అసలు మొదలే పెట్టని, మధ్యలో వదిలేసిన హామీలను సైతం తీర్చామని చెప్తూ పాలనా బండిని నడిపిస్తున్నారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ చేయలేని పనులను పది నెలల్లో చేశామని గొప్పలకు పోతున్నారు. చివరి దశలో ఉన్న కాళోజీ కళాక్షేత్రాన్ని ఆరంభించి ఆ నిర్మాణ కీర్తిని తమ ఖాతాలో వేసుకున్నారు. ఆయన ఏది చెప్పినా పత్రికలు రాస్తాయేమో కానీ, ప్రజలు మాత్రం నమ్మరు. ఎందుకంటే వారికి నిజాలు తెలుసు.**

నెహ్రూ కుటుంబం తుమ్మినా, దగ్గినా తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుకు పండుగే. నెహ్రూ, ఇందిరా గాంధీ జయంతి, వర్ధంతులకు కోట్లు ఖర్చు చేసి పత్రికల్లో ముందు పేజీ ప్రకటనలు ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. నెహ్రూ జయంతి నవంబర్ 14న బాలల దినోత్సవం నిజమే. అయితే, రేవంత్‌రెడ్డి కండ్లకు బాలలంటే స్కూల్ పిల్లలు మాత్రమే కనబడ్డారు. వాళ్ల కోసం ఏవేవో చేస్తామంటూ పత్రికల్లో ప్రకటనలు గుప్పించారు. బడి పిల్లల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే, హోటళ్లు, ఇటుక బట్టీలలో పనిచేసేవారు బాలలు కాదా? ఫుట్‌పాత్‌లపై మాసిన బట్టలతో బతికే పిల్లలు ఆయనకు కనబడలేదా? వారికి ఉత్సవాలు ఉండవా? వారిని చేరదీసి మంచి భోజనం పెట్టి, మంచి బట్టలు ఇచ్చి బాలల సంక్షేమ గృహాలకు అప్పగించవలసిన బాధ్యత ఆయనపై లేదా? అసలు నెహ్రూ ఆశించిన బాలల భవిష్యత్తు అదే కదా!

ఇక డిసెంబర్ 9న సోనియమ్మ పుట్టిన రోజు వస్తున్నది. ఆ సందడి ఎలా ఉంటుందో? రాష్ట్ర ప్రజలపై ఎంత భారం పడుతుందో..? ఆవిడ కనీవినీ ఎరుగని సంబురాలు ఇక్కడ జరుగవచ్చు. సోనియమ్మ కాళ్లు కడిగి నెత్తిన చల్లుకోవడానికి కూడా కాంగ్రెస్ వాళ్లు సిద్ధమయ్యారు. ఆ పని మీరు కూడా చేయండని ఇతర పార్టీ నేతలకూ చెప్పడం బానిసత్వానికి పరాకాష్ఠ. రాష్ట్ర ఏర్పాటు ఘనతను సోనియమ్మకు కట్టబెట్టడానికి ఆ అబద్ధాన్ని లక్ష సార్లు చెప్పినా జనం ఒప్పుకోరు. నిజంగా సోనియాగాంధీయే తెలంగాణను ఇచ్చి ఉంటే 2014లో జనం కాంగ్రెస్‌కే ఓటేసి రాష్ట్రాన్ని అప్పగించేవారు.



గత కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి మాటల దూకుడు పెరిగిపోయింది. వేదిక ఎక్కితే చాలు ఆ సమావేశం ఎందుకు ఏర్పాటుచేశారు, ఏం మాట్లాడాలనేది మరిచిపోయి కేసీఆర్ ఫాంహౌజ్, కేటీఆర్ జైలు అనే పదాలు ఆటోమేటిక్‌గా రేవంత్ నోట్లోంచి రాలుతున్నాయి. ఆవేశంతో ఆయన గొంతు చించుకుంటున్నారు. హామీల సంగతేమిటని ప్రజలు, పత్రికల నుంచి ప్రశ్నలు రాకుండా గరం గరంగా మాట్లాడుతున్నారు. దాంతో అవే మాటలు పతాక శీర్షికలవుతున్నాయి.

> **'తొక్కుకుంటూ వచ్చిన' అనడం అహంకారపూరిత మాట. ఇది రాజుల కాలం కాదు. కత్తులు, కఠారులతో కాదు, ప్రజలు ఓట్లు వేస్తే రాజ్యాధికారం వస్తుంది. మొక్క మళ్లీ చిగురిస్తుందో లేదో చెప్పడానికి ఆయనెవరు? రేవంత్ మాటలు కాదు, మిగతా నాలుగేండ్ల ఆయన పాలనే నిర్ణయిస్తుంది.**

లగచర్ల ఫార్మా విలేజీ భూసేకరణ, దాడి సంఘటన రైతుల గోడు నుంచి రాజకీయ కక్షకు వేదికైంది. హడావుడిగా పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. ఆయనను ఎక్కడ అరెస్టు చేశారన్నది కోర్టులో సరిగా చెప్పలేకపోయారు. మఫ్టీలో వెళ్లి పార్క్‌లో అరెస్టు చేయడానికి ఆయనేమైనా టెర్రరిస్టా అని కోర్టు అడిగింది. ఇంట్లో అరెస్ట్ చేశామని పోలీసులంటే ఇంటివారికి చెప్పారా అని మళ్లీ ప్రశ్నించింది. ఒక మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకోవడానికి ఇంత తొందరపాటు ఎందుకు? అని కోర్టు విసుక్కున్నది. కొణతం దిలీప్ అరెస్టు విషయంలోనూ కోర్టులో పోలీసులకు పదే పదే చుక్కెదురవుతున్నది. ఆయనను రిమాండ్‌కు పంపాలని ప్రభుత్వం ఆరాటపడుతున్నది. రిమాండ్ ఇవ్వడానికి ఈయనపై అంత సీరియస్ విషయాలేమున్నాయని కోర్టు అడుగుతున్నది. జైలు, ఊచలు అనగానే చట్టాలు రేవంత్‌కు చుట్టాలైతాయా?

లగచర్ల ఘటన జరగడానికి నిఘా వైఫల్యమే కారణం. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఊరు మీద పడి దొరికిన వారిని దొరికినట్టు అరెస్టులు, థర్డ్ డిగ్రీ హింసలు చేయడం మరో తప్పిదం. భూసేకరణ సమావేశానికి ముందు నుంచే అక్కడి ప్రజలు తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని మీడియా ముందు గోడు వెళ్లబోసుకుంటున్నారు. చస్తాం కానీ, భూములివ్వమని మహిళలు కన్నీరు పెట్టుకున్న సన్నివేశాలు టీవీల్లో చూశాం. అంత ఉద్రిక్తత పరిస్థితుల్లో అధికారులు గ్రామాలకు వెళ్లవలసిన అవసరం ఉన్నదా? ఊరివాళ్లు ఫలానా చోట ఉన్నారనగానే అధికారులు సమావేశ స్థలాన్ని వదిలి వెళ్లడమేమిటి? ముందుగా పోలీసులు ఆ విషయాన్ని నిర్ధారించాలి కదా! తగిన బందోబస్తు కల్పించాలి కదా! తప్పు ఒకరిదైతే దానికి అమాయక రైతులు బలి కావలసిందేనా? లగచెర్లలో కరెంటు ఆపేసి ఇండ్లలోకి రాత్రిపూట చొరబడి పోలీసులు రజాకార్లలా వ్యవహరించారు. రాత్రి దాడి చేసే అవసరమేమున్నది? అనుమానితులపై అరెస్టు వారెంట్లు తీసుకొని పగటిపూట అరెస్టు చేస్తే సరిపోదా! కేసీఆర్‌పై ఉన్న కోపాన్ని ప్రభుత్వం అమాయక జనంపై చూపెడుతున్నది. వారేం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయలేదు, తమ భూములనే కాపాడుకోవాలనుకుంటున్నారు.

> **ప్రజాగ్రహాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడమే దీనికి అసలు కారణం. లగచర్ల ఇప్పుడు యూపీలోని హత్రాస్‌ను తలపిస్తున్నది. హత్రాస్‌లోకి వెళ్లేందుకు వచ్చిన ఒక విలేకరిని పోలీసులు అరెస్టు చేసి, ఆయనపై ఉపా కేసు పెట్టి ఏడాది పాటు జైల్లో ఉంచారు. లగచర్లలోకి కూడా ఎవ్వరు అడుగుపెట్టే పరిస్థితి లేదు. ప్రజా సంఘాల నేతలను వెనక్కి పంపిస్తున్నారు. అరెస్టు చేసి ఎక్కడో వదిలేస్తున్నారు. మానవ హక్కుల ఉల్లంఘన పూర్తిస్థాయిలో జరుగుతున్నది.**

ఈ కేసు విషయంలో ప్రభుత్వానికి అంత దాపరికం ఎందుకో అర్థం కావడం లేదు. బాధితులు తమ గోడును లోకానికి వినిపించుకోకూడదా? ముఖ్యమంత్రి ఈ మధ్య తాను పర్యటిస్తున్న ప్రాంతాల్లో ముందస్తుగా విపక్ష నేతలను అరెస్టు, గృహ నిర్బంధం చేయడం చూస్తుంటే ప్రభుత్వం పట్ల పెరుగుతున్న వ్యతిరేకతను నియంతృత్వంగా అణచివేసే ప్రణాళిక కొనసాగుతున్నదనుకోవాలి. రాబోయే రోజుల్లో రాజకీయ కక్షలు, ప్రజా సంఘాల అణచివేతలు ఇంకా తీవ్రం కావచ్చు. ఒక ప్రణాళికాబద్ధంగా రేవంత్ రెడ్డి ప్రజా సంఘాల నేతలను చేరదీసి వారిని ప్రజలకు దూరం చేస్తున్నారు. నియంతృత్వ పాలనకు దూరంగా ఉంటూ, దానిని నిలదీయవలసిన విచక్షణ హక్కుల నేతలకు, ప్రజాస్వామ్యవాదులకు అత్యవసరం.



## నిప్పుకు చెద పట్టదు

> **తెలంగాణ ప్రాంత ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను చూడలేక, ప్రత్యేక రాష్ట్రం వస్తే తప్ప మన కష్టాలు తీరవని కేసీఆర్ భావించారు. అందుకే ఆయన ఉద్యమంలో ముందు నిలబడి, ప్రజలను భాగస్వాములను చేశారు. తద్వారా యావత్ ప్రపంచం తెలంగాణ వైపు చూసింది. తెలంగాణ ఉద్యమాన్ని తన భుజాల మీదకి ఎత్తుకున్న మహా మనీషి కేసీఆర్. అంతటి మహా మనీషిపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలుతుండటం అత్యంత ఖండనీయం.**


నిజానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజభోగాలు అనుభవిస్తున్న ఏ ఒక్క నాయకుడూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించలేదు. అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టి అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కేసీఆర్, కేటీఆర్‌లను టార్గెట్ చేసింది. ఎందుకంటే, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులకు కేటీఆర్ ఆ విషయాన్ని పదే పదే గుర్తుచేస్తుండటమే కారణం. ఆరు గ్యారెంటీలను నెరవేర్చకపోవడంతో కేటీఆర్ ప్రజల గొంతుకగా మారి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను గుర్తుచేస్తూ 420 హామీల లిస్ట్‌ను రిలీజ్ చేయడం, ప్రభుత్వాన్ని తరచూ ప్రశ్నిస్తుండటంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యలా మారారు.

అధికారంలోకి వచ్చి నెల కూడా తిరగకముందే పౌర సరఫరాల శాఖలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణంతో బోణీ చేసిన కాంగ్రెస్ బాగోతాన్ని కేటీఆర్ బట్టబయలు చేశారు. అమృత్ టెండర్ల పేరిట తన బామ్మర్దికి అడ్డగోలుగా దోచిపెట్టి రూ.2 వేల కోట్ల స్కాం చేస్తే దాన్నీ బయటపెట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల కడుపు కొట్టి తమ జేబు నింపుకోవాలని చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. పొంగులేటి ఇంట్లో ఈడీ దాడులు జరిగి నెల గడుస్తున్నా మోదీ భక్తులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించినందుకు కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీల చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తున్నందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరిట చేస్తున్న రూ.4 వేల కోట్ల స్కామ్‌ను ప్రజల ముందు పెట్టినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు. హైదరాబాద్‌కు తాగునీరు తీసుకువచ్చే ప్లాన్ పేరిట, ప్రాజెక్టు ప్లాన్ మార్చి ప్రజల సొమ్ము రూ.4 వేల కోట్లు కొట్టేయాలని చూస్తున్న రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగట్టినందుకు కేటీఆర్ టార్గెట్ అయ్యారు.

ధాన్యం కొనాలంటూ నెలరోజులుగా కల్లాల వద్ద కర్షకులు పడిగాపులు కాస్తుంటే, సమీక్ష చేసి సమస్యను పరిష్కరించే సమయం సీఎం రేవంత్‌కు లేదు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో రోగాల పాలవుతుంటే వెళ్లి పరామర్శించే తీరికా ఆయనకు లేదు. కానీ అడుగడుగునా తన అవినీతిని, ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతున్న కేటీఆర్‌ను వెంటనే ఏదో ఒక కేసులో ఇరికించి జైలు పాలు చేయాలని మాత్రం ఉత్సాహంగా ఉన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో ఎలాంటి అవినీతి జరగకపోయినా కేటీఆర్ మీద కేసు పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్ దగ్గరికి వెళ్లటానికి మాత్రం ముఖ్యమంత్రికి సమయం ఉన్నది. నాడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను తీసుకువచ్చేందుకు గాను అహర్నిశలు కృషిచేయడమే కేటీఆర్ చేసిన నేరమా? కేటీఆర్ ఒక ఉద్యమ నాయకుడు. ప్రజల పక్షాన పోరాడే తత్త్వం అతని రక్తంలోనే ఉన్నది. రేవంత్‌రెడ్డి ఎన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టాలని చూసినా కేటీఆర్ భయపడే వ్యక్తి కాదు. నిప్పుకు చెద పట్టదనేది ఎంత నిజమో కేటీఆర్ నిజాయితీపరుడనేది కూడా అంతే నిజం.



గుగులోతు రాజేష్ నాయక్, 96035 79115
(వ్యాసకర్త: రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ)




## అదానీపై మోదీ మౌనమేలా?



**"అమెరికా ఘటన గురించి వార్తలు వెలువడిన వెంటనే అదానీ ఎనర్జీ స్టాక్స్ కుప్పకూలాయి. కొనుగోళ్లు సున్నా. అమ్మకాలు మాత్రం 100 శాతం. ఆ ఘటన తెలియగానే మార్కెట్లు తక్షణమే స్పందించాయి. కానీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం మౌనం వహించింది. అసలు అందులో మోదీ, బీజేపీ పాత్ర ఎంత మేరకు ఉన్నది? ఈ విషయంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు రాజీ పడతాయి. జ్యుడీషియల్ విచారణ ద్వారా మాత్రమే నిజాలు నిగ్గు తేలుతాయి.**

**- సాకేత్ గోఖలే, టీఎంసీ ఎంపీ**